ప్రజాశక్తి
సోమవారం 15 ఏప్రిల్ 2024 పేజీలు 8



విజయనగరం



పార్వతీపురం మన్యం



ఒడ్డుకు చేర్చిన బోట్లు

- నేటి నుంచి 61 రోజుల పాటు చేపల వేట నిషేధం
- తీరప్రాంతంలో నిలిచిపోనున్న 1121 యాంత్రిక బోట్లు
- ఎన్నికల తరువాతే మత్స్యకార భరోసా?

వేటకు విరామం

చేపలు సంతానోత్పత్తి కోసం ప్రతి ఏటా ఏప్రిల్ నుంచి రెండు నెలల పాటు గుడ్లు పెడుతుంటాయి. చేపలు గుడ్లు పెట్టే సీజన్‌లో ప్రతి ఏటా సముద్రంలో వేటను నిషేధిస్తుంటారు. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడా ప్రభుత్వం చేపల వేటను నిషేధిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి రెండు నెలల పాటు అనగా జూన్ 14 వరకు 61 రోజుల పాటు వేటను నిషేధించింది. ఈ సమయంలో ఎవరైనా వేటకు వెళ్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

ప్రజాశక్తి-భోగాపురం

జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో సముద్ర తీరప్రాంత గ్రామాలు ఉన్నాయి. ఇందులో భోగాపురంలో ఐదు, పూసపాటిరేగ మండలంలో 11 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 10 వేల కుటుంబాలుండగా, అందులో సగానికి పైగా కుటుంబాలకు చేపల వేటే ఆధారం. రెండు మండలాల నుంచి సుమారు 1121 ఇంజిన్ బోట్లు నిత్యం ఈ ప్రాంతంతో పాటు విశాఖ నుంచి వేటకు వెళ్తుంటాయి. సోమవారం నుంచి (మిగతా..3లో)

రెండు నెలలూ ఇబ్బందులే



రెండు నెలలపాటు చేపల వేటను ప్రభుత్వం నిషేధించడం వల్ల ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. మాకు వేటే ప్రధాన ఆధారం వేరే పనికి వెళ్లలేని పరిస్థితి. ఎన్నికలు కావడంతో మత్స్యకార భరోసా కూడా ఆలస్యమయ్యే అవకాశం ఉందంటున్నారు. ఏదో విధంగా ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– బడి సింహాచలం, మత్స్యకారుడు, ముక్కాం గ్రామం

మత్స్యకార భరోసాపై ఆదేశాలు రాలేదు



మత్స్య సంపదను పెంపొందించేందుకు ప్రతి ఏడాది ప్రభుత్వం వేట నిషేధిస్తుంది. ఈ రెండు నెలల కాలంలో వివిధ రకాల చేపలు, రొయ్యలు గుడ్లు పెట్టి సంతానోత్పత్తిని పెంపొందిస్తాయి. ఎవరైనా వేటకు వెళ్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మత్స్యకార భరోసా పథకం అమలుకు ఎటువంటి ఆదేశాలూ రాలేదు.

– ఎన్.నిర్మలాకుమారి, మత్స్యశాఖ డిడి



పార్వతీపురంలో ఉద్రిక్తత

వాగ్వివాదానికి దిగిన టిడిపి, వైసిపి నాయకులు

ఎన్నికలకు నెలరోజులు గడువు ఉండగానే పార్వతీపురం నియోజకవర్గ కేంద్రం వేడెక్కింది. ఎమ్మెల్యే అలజంగి జోగారావు వాలంటీర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని, దీన్ని అరికట్టాలంటూ టిడిపి అభ్యర్థి బోనెల విజయచంద్ర తొలుత ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు స్పందించకపోవడంతో నేరుగా తన అనుచరులతో ఎమ్మెల్యే ఇంటి సమీపానికి వెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సమస్య సద్దుమణిగింది. ఆదివారం చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

- వాలంటీర్లకు డబ్బులిస్తున్నారన్న సమాచారంతో ఎమ్మెల్యే ఇంటి వద్ద టిడిపి అభ్యర్థి బైఠాయింపు
- ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వివాదం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



ఎఎస్‌పితో మాట్లాడుతున్న బోనెల విజయచంద్ర

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు నియోజకవర్గంలోని వాలంటీర్లను తన ఇంట్లో సమావేశపర్చి నగదు అందచేస్తున్నారన్న సమాచారంతో టిడిపి అభ్యర్థి బోనెల విజయచంద్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు ఎప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో విజయచంద్ర తన సహచరులతో కలిసి సివిజిల్‌లో ఫిర్యాదు చేసేందుకు వీడియోలు తీసేందుకు ఎమ్మెల్యే (మిగతా..3లో)

19న అరకు సిపిఎం ఎంపి అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి – సీతంపేట

అరకు పార్లమెంటు సిపిఎం అభ్యర్థి పి.అప్పలనరస ఈనెల 19న పార్వతీపురంలో నామినేషన్ వేయనున్నట్టు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈనెల 16న ఉదయం 9గంట నుంచి మధ్యాహ్నం 2గంటకు సాలూరు నియోజకవర్గంలోనూ, సాయంత్రం 4గంట నుంచి రాత్రి 8గంట వరకు బలిజిపేట మండలంలో ప్రచారం చేస్తారన్నారు. అలాగే 17న ఉదయం 9గంటలకు పాలకొండ, 11గంటలకు సీతంపేట, సాయంత్ర 5గంట పార్వతీపురం పాతబస్ స్టాండ్ వద్ద నుంచి ర్యాలీ, సభల్లో పాల్గొంటారు. 19న పార్వతీపురంలో అభ్యర్థి నామినేషన్ ఉందని, కావున జిల్లాలో ప్రతి మండలం నుంచి పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

సిఎంపై దాడి హేయమైన చర్య

వైసిపి రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయవాడలో సిఎం జగన్మోహన్ రెడ్డిపై జరిగిన దాడిని జెడ్‌పి చైర్మన్, వైసిపి రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తులపై భౌతిక దాడులు హేయమైన చర్యని, ఇలాంటి దాడులను అందరూ ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. సిఎం జగన్‌కి ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ ఆదరణ చూసి ఓర్వలేని కొంతమంది టిడిపి నాయకులు ఇటువంటి ఘటనలను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. జగన్‌పై దాడి ఇదేం కొత్త కాదని, గతంలో ప్రజా సంకల్ప యాత్ర సమయంలో కూడా భౌతిక దాడి చేయించి టిడిపి నాయకులు లబ్ధి పొందాలని చూశారని చెప్పారు. ఇటువంటి చర్యలను ఖండిస్తూ జిల్లాలో వైసిపి శ్రేణులు శాంతియుతంగా నిరసన తెలియజేయాలని కోరారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

బిఆర్ అంబేద్కర్ జయంతిని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటం వద్ద కలెక్టర్ నాగలక్ష్మి జ్యోతిని వెలిగించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ అనిత, డిప్యూటీ కలెక్టర్ సుమ బాల, సోషల్ వెల్ఫేర్ డిడి రమానందం, మెప్మా పీడీ సుధాకరరావు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించండి 8లో

2.6 కిలోల బంగారం స్వాధీనం

రూ.17.95 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి-విజయనగరం కోట



బంగారాన్ని తూనిక వేస్తున్న అధికారులు

నగరంలో శనివారం రాత్రి భారీగా బంగారు నగలు, నగదు పట్టుబడ్డాయి. 2.663 కిలోల బంగారం, రూ.17.95 లక్షల నగదును పోలీసులు సీజ్ చేశారు. నగరంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు ఆధ్వర్యాన ఎస్ఐ నవీన్ పడాల్, సిబ్బంది వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒక వ్యక్తిని ఆపి, తనిఖీ చేశారు. ఆయన వద్ద 2.663 కిలోల బంగారు నగలు, రూ.17.95 లక్షల నగదు గుర్తించారు. వాటికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. నగదు, బంగారు ఆభరణాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీ, ఆదాయ పన్ను శాఖకు తదుపరి చర్యల నిమిత్తం పంపించినట్లు సిఐ బి.వెంకటరావు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి భీమిలి మండలం అన్నవరం గ్రామానికి చెందిన అమర రాజయ్య అని, విశాఖపట్నంలో గోల్డ్ గెయిన్ అనే జ్యువెలరీ షాపులో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. ఆ షాపు యజమాని పవన్‌కుమార్ విజయనగరంలోని బంగారు షాపులకు వస్తువులను విక్రయించి, డబ్బులు తీసుకురావాలని చెప్పడంతో ఇక్కడికి వచ్చినట్లుగా విచారణలో వెల్లడించారని తెలిపారు. సీజ్ చేసిన బంగారు వస్తువుల విలువ రూ.1.51 కోట్లుగా అంచనా వేశామన్నారు.


బొబ్బిలి: అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


బొబ్బిలి: అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే


చీపురుపల్లి: నివాళులర్పిస్తున్న కళావెంకటరావు


ఎస్‌కోట: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతినబూనుదాం

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు. మన భారత రాజ్యాంగం గొప్పతనాన్ని విద్యార్థులకు అర్థమయ్యే విధంగా చెప్పాలని జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ అన్నారు. విభిన్న భాషలు,మతాలు, కులాలు, భిన్న సంస్కృతులు కలిగిన మన దేశంలో సమైక్యత కోసం రాజ్యాంగం ఏ విధంగా ఉండాలో మహనీయుడు రూపొందిం చారని సమావేశంలో పాల్గొన్న మన్యం జిల్లా నాయకులు మధుసూధనరావు, సత్యన్నారాయణ, అప్పలనాయుడు, శ్రీనివాస్, అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణదాసు, రమేష్, శ్రీనివాస్, మహేష్, రామకృష్ణ, జగదీష్, వెంకటరావు, పారినాయుడు, శంకరరావు పాల్గొన్నారు.


సిఐటియు ఆధ్వర్యంలో

రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి ఈనాటి పాలకులు పూనుకుంటున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు అన్నారు. పట్టణంలోని అంబ్కేదర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. న్యాయ వ్యవస్థను, రాష్ట్రాల హక్కులను, పౌర హక్కులను, రాజ్యాంగంలో కల్పించిన ప్రజల హక్కులను ఈనాటి పాలకులు కాలరాస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి. గౌరీ, జె. రామారావు కార్యకర్తలు బి.వెంకటి, జి. వాసు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి అంబేద్కర్ అని సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు అన్నారు. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా స్థానిక ఎగువ హరిజన వీదిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని పరిరక్షించడానికి అంబేద్కర్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా నాయకులు అరుణ, సింహాచలం, వెంకటి, పాపమ్మ, పద్మమ్మ, లక్ష్మమ్మ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. ఆదివారం జరజాపుపేట దళిత కాలనీలో దళితులతో కలిసి రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ దళిత, గిరిజన, వెనుకబడ్డ వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఉంద్రు రామారావు, రాచర్ల కృష్ణ, మాత కృష్ణ, ములపర్తి బాబురావు, సారికి రమణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా సిపిఎం నాయకులు గాడి అప్పారావు, దళిత సంఘ నాయకులు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటామని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను సాధిస్తామని నినాదాలు చేశారు. కొత్తవలస జంక్షన్, గాంధీనగర్, ఎమ్మార్వో కార్యాలయం, చింతలపాలెం, ఎస్‌సి కాలనీ, తదితర ప్రాంతాల్లో అంబేద్కర్ ఉత్సవాలు ఘనంగా జరిపారు.


రామభద్రపురం : నివాళులర్పిస్తున్న కాలనీ వాసులు

ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ, ఎస్‌సి ఉద్యోగుల సంఘం నాయకులు పి.అప్పయ్య, ఆర్.వరప్రసాద్, అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సౌరు సాంబయ్య వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతో పేదలకు న్యాయం జరుగుతుందని నాయకులు అన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో : అంబేద్కర్ గొప్ప దార్శినికుడని ప్రభుత్వ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రామ్ నరేష్ అన్నారు. ఆదివారం అంబెద్కర్ 133 వ జయంతిని రోటరీ కార్యాలయంలో రోటరీ ఆధ్వర్యంలో అధ్యక్షులు జెసి రాజు నిర్వహించారు. ముఖ్య అధితిగా హాజరైన ప్రభుత్వ వైద్యులు డాక్టర్ జి. రామ్ నరేష్, రోటరీ ఉపాధ్యక్షులు కె నాగరాజులు అంబెద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు సింద్రీ శ్రీనివాసన్, కె రామకృష్ణ, జి.శంకర రావు, దుర్గ ప్రసాద్, చంటి తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు అన్నారు. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా పేరాపురంలో సీనియర్ పాత్రికేయులు, కెవిపిఎస్ నాయకులు తాలాడ బుజ్జిబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని మనం కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పేరాపురం సర్పంచ్ రౌతు శ్రీరామ్ మూర్తి, పూసపాటిరేగ సర్పంచ్ టొంపల సీతారాములు, పేరాపురం మాజీ సర్పంచ్ బొంతు ఉమ, మాజీ ఎంపిటిసి వలిరెడ్డి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ బొంతు రవికుమార్, వైసిపి నాయకులు కోరాడ మహేష్ పాల్గొన్నారు.

వేపాడ: సీనియర్ దళిత నాయకుడు కొమరపల్లి ఏసుదాసు, దళిత మహాసభ అధ్యక్షుడు రాము సింగరాయ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యువకులు మహిళలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. మండంలోని వావిలపాడులో సర్పంచ్ దంపతులు బీల సతీస్, రాజేశ్వరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బూడి వెంకటరావు, నాగిరెడ్డి రాజునాయుడు, జై భీమ్ కార్యకర్తలు కణితి చిన్నా, వేమాద్రి కిరణ్, కొమ్మాది దేవి తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ఐలు అప్పారావు, చిన్నయ్య, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

వంగర: సమ సమాజ స్థాపనకు, నవ సమాజ నిర్మాణానికి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎంతగానో కృషి చేశారని ఎస్.ఐ వైవి జనార్ధన్ కొనియాడారు. అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దళిత బహుజన జెఎసి ఆధ్వర్యంలో వంగర, లక్ష్మింపేట, శివ్వాం, అరసాడ, పట్టు వర్ధనంతో పాటు పలు గ్రామాలలో డప్పు వాయిద్యాలతో ఆదివారం ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ. వై.వి జనార్ధన్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఎస్ఐ చేతుల మీదుగా మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన జెఎసి ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మజ్జి గణపతి, దళిత సేన రాష్ట్ర కార్యదర్శి ఎం గణపతిరావు, బహుజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు చిత్తిరి గంగులు, డర్రు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్ల: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, రాష్ట్ర కార్యదర్శి కె. వి. సూర్యనారాయణ రాజు, జిల్లా ఎఐఎం కార్యదర్శి కెల్ల భీమారావులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాష్ట్ర మాల మహానాడు కార్యదర్శి లోగిస రామకృష్ణ గూడెంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలో పెనుబర్తి, చింతపల్లి పేట, తెట్టంగి తదితర పంచాయతీలలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు, ప్రసాద్, ఎఐఎం సభ్యులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: లావేరు రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి విజయగనరం ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను యువతీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాలలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక రామతీర్థంలో కూడలిలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జంతు సంక్షేమం విద్యార్థులు బాధ్యత అనే అంశం పై రామతీర్థం జంక్షన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటిల్లో నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు పట్టణ అధ్యక్షుడు అదపాక రాంబాబు, ఉపాధ్యక్షుడు గురుమూర్తి, కోశాధికారి బూసర రవి, విద్యార్థి సంఘ నాయకులు లోగిశ అక్షయ్, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో: అంబేద్కర్ జయంతి సందర్భంగా టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు, రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, బెల్లాన రాజినాయుడు, రెడ్డి వేణు, లోగిస శ్రీను, వానపల్లి వీరభద్రరావు, రెల్లి వెంకటేష్, బెల్లాన అప్పలనాయుడు, పిల్ల శ్రీను తదితరులు రామతీర్థం కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

శృంగవరపుకోట: అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మండలంలోని ధర్మవరం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకట రమణ, జెసిఎస్ ఇంచార్జి వాకాడ సతీష్, కూనిరెడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నా రు.


పూసపాటిరేగ: నివాళులర్పిస్తున్న నాయకులు

పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి దామోదర శ్రీధర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తిమిడి గ్రామ సర్పంచ్ వబ్బిన తిరునాథమ్మ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ధర్మారావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు వబ్బిన సన్యాసినాయుడు పాల్గొన్నారు. పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యనిర్వాహణాధికారి కన్నబాబు ఆధ్వర్యంలో, ఎస్‌టియు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్‌టియు కొత్తవలస మండల అధ్యక్షుడు ప్రేమ సీతారాం అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకం పంపిణీ చేశారు. ఓటర్ అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ సంతోష్ కుమారి పట్టణంలోని ప్రకాష్ మార్కెట్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు.

తెర్లాం: రిటైర్డ్ ఆర్‌టిఒ బి వెంకట్రావు జగన్నాథవలస గ్రామంలో, పెరుమాలి సర్పంచ్ ప్రతినిధి ఎస్ అప్పల నరసింహారాజు పెరుమాలిలో, తెర్లాం, డి.గజబవలస, కొల్లివలస గ్రామాల్లో ఆయా గ్రామ పెద్దలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవ వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెర్లాం సర్పంచ్ రూప, ఎంపిటిసి జి ఆనందరావు, జి వెంకట్రావు, బి మురళీకృష్ణ పాల్గొన్నారు.

జామి: జామి ఎస్‌సి కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, దళిత సంఘం నాయకులు బోని జీవన్, ఉపాధ్యాయులు ఇప్పాక నాగరాజు, కృష్ణ, రామచద్రుడు, కాలనీ వాసులు, పెద్దలు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో సర్పంచ్ గుడుమూరు పట్టాభి, రైతు సంఘం నాయకులు నారు జనార్ధన రావు, టిడిపి నాయకులు గుణుపూర్ రాము, మజ్జి రాముడు పేట గ్రామంలో రాజన్న, ఉంగరాడ మెట్ట వద్ద ఎస్‌సి, ఎస్‌టి టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంఇఒ ఎం వరప్రసాదరావు, జ్యోతి, బూరాడ గ్రామంలో జై భీమ్ అధ్యక్షులు మోహన్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

విజయనగరం టౌన్ : జిఎస్ఆర్ కాంప్లెక్సులో అంబేద్కర్ చిత్రపటానికి జనసేన పార్టీ నాయకులు గురాన అయ్యలు, ఆదాడ మోహన్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వజ్రపు నవీన్‌కుమార్, ఎంటి రాజేష్, ఎం.పవన్ కుమార్, ఎం.శ్రీను, సిహెచ్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

జెఎన్‌టియులో.. జెఎన్‌టియుజివిలో అంబేద్కర్ చిత్రపటానికి విసి కె.వెంకటసుబ్బయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం ఎస్‌సి, ఎస్‌టి సెల్ కోఆర్డినేటర్ ఎం.సౌభాగ్యలక్ష్మి, ప్రొఫెసర్ జి.జయసుమ, రిజిస్ట్రార్ కె. బాబు పాల్గొన్నారు.

విజయనగరం కోట : బాలాజీ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అది గజపతిరాజు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, పిల్లా విజయ్‌కుమార్, జనసేన నాయకులు రౌతు సతీష్ పాల్గొన్నారు. **కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన..** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకరి సతీష్ కుమార్, నాయకులు కొణతాల రమాదేవి, దేవుపల్లి సూరప్పడు, కరీం, రెహమాన్, కోట్ల మోహన్, సిహెచ్ చంద్రశేఖర్ ,మామిడి అప్పారావు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత.. పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధం

విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెలే గీత

ప్రజాశక్తి - విజయనగరం కోట

ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్థానిక మాజీ ఎమ్మెల్యే మీసాల గీత స్పష్టం చేశారు. అందరి ఆత్మగౌరవం అనే నినాదంతో ముందుకు సాగుతానన్నారు. ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన తండ్రి గురాన సాధూరావు ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. అనంతరం 2014 ఎన్నికల్లో టిడిపి తరపున విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసి సమీప అభ్యర్థిపై 15,600 ఓట్ల మెజార్టీ వచ్చిందని గుర్తుచేశారు. ఆ ఐదేళ్ల కాలంలో తన శక్తిమేర ప్రజలకు సేవచేశానని అన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేశారని అన్నారు. 2019లో తిరిగిన తనకు అసెంబ్లీ టిక్కెట్ కేటాయించకపోయినప్పటికీ టిడిపి అధినేత చంద్రబాబు సూచన ప్రకారం పార్టీ కోసం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీసాల

పనిచేశానన్నారు. పదవుల కోసం చూడకుండా పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసినప్పటికీ బిసి మహిళనైన నాకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2023లోనే చీపురుపల్లి శాసన సభ లేదా, విజయనగరం లోక్ సభ నుంచి తప్పక పోటీకి దింపుతామంటూ తనకు హామీ ఇచ్చారని అన్నారు. ఆ తరువాత పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను కలిసినప్పుడు కూడా అదేరకమైన భరోసా ఇచ్చారని అన్నారు. పార్టీ ఆదేశాల ప్రకారం ఇప్పటి వరకు ఎదురు చూసినప్పటికీ ఆశాభంగం కలిగిందన్నారు. నాకు స్థానం ఇవ్వలేదు సరికాదా కనీసం పార్టీ నుంచి ఎలాంటి సమాచారం కూడా ఇవ్వకపోవడం బాధాకరమ న్నారు. పార్టీ ప్రయోజనాల కోసం కష్టపడుతూ గడిచిన దశాబ్ధకాలంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని అన్నారు. తనకు కూడా రాజకీయ నేపథ్యం, అనుభవం ఉన్నాయని అన్నారు. తన ఆత్మాభిమానాన్ని వదులుకోలేక స్వతంత్ర్యంగా బరిలోకి దిగుతున్నానని స్పష్టం చేశారు. విజయనగరం ఆడపడుచుగా, మున్సిపల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా సేవలందిం చిన తనకు ప్రజల మద్ధతు తప్పక ఉంటుందని భావిస్తున్నాని అన్నారు. సమావేశంలో ఆమె మద్ధతుదారులు సైలాడ త్రినాధ్, మాజీ జెడ్పీటిసి సభ్యులు తుంపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

వేటకు విరామం

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 14వ తేది వరకు చేపల వేటను ప్రభుత్వం నిషేధించింది. ఈ రెండు నెలలు కాలంలో మత్స్యకారులకు వేటలేకపోవడంతో వారిని ప్రభుత్వం ఆర్థికంగా కొంత వరకు ఆదుకునేది. ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరుతో వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడికి వారి అకౌంట్లలో రూ.10 వేలు చొప్పున జమచేసేది. ఈ ఏడాది ఎన్నికలు ఉండటంతో ఈ పథకం ప్రస్తుతం అమలయ్యే సూచనలు కనిపించడం లేదు. ప్రతి ఏడాది వేట నిషేధం ప్రకటించిన రెండు మూడు రోజుల్లో సాయం చేసేందుకు వేటకు వెళ్లే మత్స్యకారులను మత్స్యశాఖ అధికారులు గుర్తిస్తుంటారు. మరి ఈ ఏడాది ఎన్నికలు ఉండడంతో దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటనా ప్రభుత్వం చేయలేదు. గతేడాది మే నెలలో భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో మొత్తం 3522 మందికి మత్స్యకార భరోసాను అందజేశారు.

మత్స్యసంపదను పెంపొందించేందుకే..

సముద్రంలో మత్స్య సంపదను పెంపొందించేందుకే రెండు నెలలపాటు ప్రభుత్వం వేటను నిషేధిస్తుంది. ఈ సమయంలో వివిధ చేప, రొయ్య జాతులు గుడ్డు పెట్టి తమ సంతానోత్పత్తిని పెంపొందిస్తుంటాయి. ఈ సమయంలో తల్లి చేపలు, రొయ్యలను రక్షించేందుకు వేటను నిషేధిస్తారు. దీంతో మత్స్య సంపదను ప్రోత్సహించి తిరిగి మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉపయోగపడుతుందని అంటున్నారు అధికారులు. అందుకే ఈ సమయంలో మత్స్యకారులెవరూ వేటకు వెళ్లవద్దని చెబుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు

చేపలు గుడ్లు పెట్టే సమయంలో యాంత్రిక పడవలను సముద్రంలోకి వెళ్లేందుకు అనుమతించరు. ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం (ఎపిఎఫ్ఎంఆర్ చట్టం-1994) అనుసరించి సెక్షన్ (4) ప్రకారం ఎవరైనా ఉల్లంఘించి వేటకు వెళ్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. వేటకు వెళ్తే వారి వద్దనున్న మత్స్యసంపదను స్వాధీనం చేసుకుంటారు. అంతేకాక జరిమానాతోపాటు డీజిల్ రాయితీ, అన్ని రకాల రాయితీ సౌకర్యాలను నిలుపుదల చేస్తారు. మెరైన్ పోలీసులు, కోస్టుగార్డులు, కోస్టల్ సెక్యూరిటీ, నేవీ, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు నిత్యం పహారా కాస్తుంటారు. కాని ఇంజిన్లు లేని తెప్పల్లో వేట చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇవి కూడా కేవలం తీరం నుంచి ఎనిమిది నాటికల్ మైళ్ల దూరం లోపలే వేట చేసుకోవచ్చని అధికారులు అంటున్నారు.

పార్వతీపురంలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

ఇంటి సమీపానానికి వెళ్లి చిత్రీకరిస్తున్నారు. ఈ విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే తన అనుచరులతో వీడియోలు తీస్తున్న నర్సిపురం గ్రామానికి చెందిన కొల్లి వాసు, డ్రైవర్ సురేష్ దగ్గర నుంచి బలవంతంగా కెమెరాలు లాక్కొన్నారు. దీంతో ఎమ్మెల్యే, విజయచంద్ర మధ్య వాగ్వివాదం జరిగింది. ఇరు పార్టీల నాయకులు కేకలు వేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈలోగా విషయం తెలుసుకున్న ఎఎస్పీ సునీల్‌షరోన్, పట్టణ, రూరల్ సిఐలు కృష్ణారావు, రవికుమార్ సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి నుంచి విజయచంద్రను ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇలా ప్రత్యర్థుల ఇళ్ల వద్దకు రాకూడదని హెచ్చరించి వెనుక్కు పంపి, అతని వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యే జోగారావుకు నచ్చజెప్పి ఇంట్లోకి పంపించి వేశారు. అనంతరం ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రత్యర్థుల ఇళ్లపై ఇలా మందీ మార్భలంతో దాడికి రావడం తెలుగుదేశం ప్రభుత్వం సంస్కృతి అని, ఎమ్మెల్యేగా తన ఇంటికి వందల సంఖ్యలో వస్తుంటారని, వారందర్నీ వాలంటీర్లు అనడం సబబు కాదని అన్నారు. పోలీసులు కూడా టిడిపి పార్టీకి పరోక్షంగా సహకరిస్తున్నారని, తన ఇంటిపై దాడి జరిగిందని ఫిర్యాదు చేసిన అరగంట వరకూ పోలీసులు రాలేదని విమర్శించారు. అంతేకాకుండా ఎఎస్పీ తన పట్ల అమర్యాదకరంగా ప్రవర్తించారని, దీనిపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని అన్నారు.

ఈ ఘటనపై టిడిపి అభ్యర్థి బోనెల విజయచంద్ర మాట్లాడుతూ అధికార, ధనబలం ఉందన్న గర్వంతో స్థానిక ఎమ్మెల్యే వాలంటర్లను డబ్బులతో ప్రలోభపర్చడం, అక్రమాలకు ప్రోత్సాహించడం తన ఇంటినే కేంద్రంగా చేస్తుండడంతో అధికారులకు తగిన ఆధారాలతో కూడిన సమాచారం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే ఇంటి ముందు దృశ్యాలను తీయడానికి వెళ్లామన్నారు. తనపైనా, తన అనుచరులపైనా ఎమ్మెల్యే, అతని అనుచరులు దాష్టీకానికి పాల్పడ్డారన్నారు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లడానికి అనుమతులు తీసుకోవాలా, అదేమైన నిషేధిత ప్రాంతమా అని ప్రశ్నించారు. తన ఇంటినే కేంద్రంగా మార్చుకుని ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్న ఆయనపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇరువర్గాలు రూరల్ స్టేషన్‌కు చేరుకుని ఒకరిపై ఒకరు ఫిర్యాదులకు ఉపక్రమిస్తున్నారు.



అంబేద్కర్ జయంతి సభలో మాట్లాడుతున్న జెసి శోబిక

ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ, సాధికారిత శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమాజం పట్ల సేవాగుణం, ఎదుటివారిపట్ల స్నేహభావం కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి.కేశవ నాయుడు, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఇడి పి.శశిభూషన్ రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ.ప్రభాకరరావు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ, సాధికారిత శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



తిరుమలరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

కళింగాంధ్రలో తిరుమలరావు కవిత

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని ఓని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రోపాధ్యాయునిగా పనిచేస్తున్న కుదమ తిరుమలరావు రచించిన కవిత, కళింగాంధ్ర గ్రంథంలో స్థానం పొందింది. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో జరిగిన కళింగాంధ్ర గ్రంథం ఆవిష్కరణ సభలో తిరుమలరావును సన్మానించారు. కవితాలయం వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ రఫీ ఈ వేమన, తపస్వీ మనోహరం సహాయం సంపాదకులు బలివాడ తేజస్వినిల ఆధ్వర్యంలో, ఈ రెండు సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కళింగాంధ్ర పుస్తకావిష్కరణ అనంతరం తిరుమలరావును అభినందించి సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు, విశ్రాంత సిఇఒ సురంగి మోహనరావు ఈ కళింగాంధ్రను ఆవిష్కరిం చారు. వేదికపై తిరుమలరావు తన కవితాగానం చేసి అందరి ప్రశంసలు పొందారు. అనంతరం తిరుమలరావును నిర్వాహకులు, అతిథులు, కవి సమ్మేళనం సమన్వయకర్తలు ఘనంగా సన్మానించారు. తిరుమలరావు సత్కారం పొందడంపట్ల రాజాం రచయితల వేదిక కన్వీనర్ గార రంగనాథం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కె.జమ్మడగూడకు చెందిన సవర గంగరాజు (38) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారని ఎస్ఐ జగదీష్ నాయుడు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం సీతంపేట మండలం కె.జమ్మడుగూడ చెందిన సవర గంగరాజు ఉదయం తన పాత ఇంటి గోడ తవ్వుతుండగా ప్రమాదవశాత్తు ఆ గోడ తన మీద పడిపోవడంతో, గాయాలతో ఉన్న అతనిని వైద్యం నిమిత్తం సీతంపేట ఏరియా ఆసుపత్రికి, అక్కడనుండి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గంగరాజు భార్య సవర అద్దమ్మ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జనార్ధనమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జామి

మండలంలోని మాధవరాయమెట్ట సమీపంలోని మెడిశెట్టి గోవింద (48) విద్యుదాఘాతంతో మృతి చెందారు. పోలిసులు వివరాలు ప్రకారం... ఎస్‌కోట మండలంలోని ఆలుగుబిల్లి గ్రామానికి చెందిన గోవింద పెయింటింగ్ నిమిత్తం బంకు ఎదురుగా ఉన్న షెడ్‌లో పనికి వెళ్ళాడు. పని ప్రదేశంలో ట్రాన్స్ పార్మార్ ఉండడంతో గోవింద వేసిన నిచ్చెన తగిలి, షాక్ కొట్టడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. జామి పోలిసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండ గంగుపూడి గ్రామానికి చెందిన పాత బోయిన పెంటయ్య (70) ఆదివారం జరిగిన ఆటో ప్రమాదంలో మృతి చెందారు. ఇతను బొద్దాంలో జరిగిన వారపు సంతకు వచ్చి ఇంటికి తిరిగి ఆటోలో వెళుతుండగా కాలికి ఉన్న చెప్పు జారిపోవడంతో ఆటో లోనుంచి దూకేశాడు. దీంతో అతని తల రోడ్డుకు గట్టిగా తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతనికి ముగ్గురు కుమారులున్నారు. భార్య సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

భోగాపురం : పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేసి రూ.10,080 నగుదుతోపాటు ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. భోగాపురం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వెనుక భాగంలోని పాకలో పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్ఐ తాతారావు ఆధ్వర్యంలో సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు.

బొబ్బిలి: పట్టణంలోని సాయి నగర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి రూ.30,200 సీజ్ చేసినట్లు ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ చెప్పారు. పేకాట అడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులు తీసుకోవడం నిజం కాదా?

ఆ ఫోన్‌పే అకౌంట్ల తనిఖీకి సిద్ధమా?
గిరిజన సంక్షేమ డిడి బుకాయింపు

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖలో సిఆర్టీల రెగ్యులరైజేషన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని డిప్యూటీ డైరెక్టర్ రుక్మాంగధరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ నాలుగు దశల్లో ఆన్‌లైన్‌లో జరిగిందని చెప్పారు. ఈనెల 13న ప్రజాశక్తిలో సిఆర్టీల రెగ్యులరైజేషన్‌కు దండిగా వసూళ్లు అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇదిలా ఉండగా 131 మంది సిఆర్టీల రెగ్యులరైజేషన్ ప్రక్రియకు సంబంధించి ఒక్కొక్కరి నుంచి లక్షన్నర వసూలు చేసినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ముడుపులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు అందాయనేది జగమెరిగిన సత్యం. రెగ్యులరైన సిఆర్టీల నుంచి వసూలు చేసిన డబ్బులు ఫోన్‌పే ద్వారా కొంతమంది మధ్యవర్తులకు చేరాయనే ప్రచారం జరుగుతోంది. ఇంతవరకు వసూలు చేసింది చాలక ఇంకా వేర్వేరు కారణాలతో అదనంగా వసూళ్లు చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. సిఆర్టీల విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల స్థాయిలోనే జరిగింది. కానీ ఆ పరిశీలన పేరుతో అదనంగా డబ్బులు చెల్లించాలని కోరుతున్నారని కొంతమంది ఉపాధ్యాయులు గుసగుసలాడుకుంటున్నారు. ఇది కాక సిఆర్టీలకు సబ్ ట్రెజరీల్లో ఒక ఐడి ఉంటుంది. రెగ్యులరైన తర్వాత వారికి సిఎఫ్ఎంఎస్ ఐడిలు సృష్టించాలి. ఈ ప్రక్రియని గిరిజన సంక్షేమ శాఖ అధికారుల పర్యవేక్షణలో జరగాల్సి వుంది. ఈ ప్రక్రియను నిర్వహించడానికి కూడా అధికారులు ఉపాధ్యాయుల నుంచి ఆమ్యామ్యాలు ఆశిస్తున్నట్లు సమాచారం. వసూళ్లు నిజమో అబద్ధమో తేలాలటే ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేసిన మధ్యవర్తుల ఖాతాలను తనిఖీ చేయాలి. ఇది జరగాలంటే వేరే ప్రభుత్వ శాఖ అధికారితో విచారణ జరిపించాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

విచారణ చేపట్టాలి

కాంట్రాక్టు ఉపాధ్యాయుల రెగ్యులరైజేషన్ ప్రక్రియలో అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడిన ఆరోపణలపై విచారణ జరిపించాలి. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను నియమించాలనే ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా అధికారులు డెప్యుటేషన్ల పేరుతో బదిలీలు చేయడం అన్యాయం. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలి. ఈ అక్రమాలకు బాధ్యులైన డిప్యూటీ డైరెక్టర్, సూపరింటెండెంట్లపై చర్యలు తీసుకోవాలి.

- పి.రంజిత్ కుమార్, టి.సాయిబాబు,
గిరిజన సంక్షేమ సంఘం,
అధ్యక్ష, కార్యదర్శులు



తిరుపతిరావును కలిసిన సాలూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సంధ్యారాణి

అంతా కలిసి పనిచేద్దాం

పెంట నివాసానికి వెళ్లిన గుమ్మడి

ప్రజాశక్తి - మక్కువ

సాలూరు నియోజకవర్గ పరిధిలో అంతా కలిసిమెలిసిగా పనిచేసుకొని ముందుకు సాగుదామని టిడిపి అభ్యర్థిని గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆమె మండల టిడిపి మాజీ అధ్యక్షుడు పెంట తిరుపతిరావు నివాసానికి వెళ్లి ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా అంతా కలిసికట్టుగా వచ్చి తమ విజయానికి కృషి చేయాలని, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇకపై ఏ విధమైన మనస్పర్ధలకు తావివ్వకుండా బూత్ లెవెల్‌లో పార్టీ విజయానికి అత్యధిక ఓట్లు వచ్చేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు తిరుపతిరావు పిలుపునిచ్చారు. అంతకుముందు ప్రస్తుతం మండల పార్టీ అధ్యక్షులు జి.వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో మండల స్థాయిలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ కూడా హాజరయ్యారు. ఈ సమావేశంలో మాట్లాడిన సంధ్యారాణి ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. ఎన్నికల్లో గెలుపు దిశగా అంతా పని చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మామిడి ప్రసాదరావు నాయుడు, మెంటాడ పాచిపెంట మండల నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొయ్యనుపేట పంచాయతీ నుంచి పలువురు వైసిపిని వీడి టిడిపిలోకి చేరారు.

మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి

ప్రజాశక్తి- డెంకాడ

మరోసారి తన తండ్రి బడ్డుకొండ అప్పలనాయుడుకు ఎమ్మెల్యేగా అవకాశమిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తనయులు బడ్డుకొండ మణిదీప్, రాష్ట్ర ఐటీ వింగ్ సెక్రెటరీ, నియోజకవర్గ యువజన నాయకులు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు అన్నారు. మండలంలో చొల్లంగిపేట సచివాలయం పరిధిలోగల నగరపేట, గొల్లపేట, డిఆర్ పాలెం, సేరిపాలెం గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి తమ్మునాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కనక సింహాచలం, రామతీర్థం బోర్డు డైరెక్టర్ దాట్ల సూర్యనారాయణ రాజు, సర్పంచ్ కనకరాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాస రావు, ఎంపిటిసి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



జామిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న గజపతినగరం ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

శంబంగి ఎన్నికల ప్రచారం

బొబ్బిలి: పట్టణంలోని నాయుడు కాలనీ, ఇందిరమ్మ కాలనీలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. టిడిపి హయాంలో నాయుడు కాలనీ, ఇందిరమ్మ కాలనీలో అభివృద్ధి కుంటు పడితే వైసిపి హయాంలో అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. అభివృద్ధికి ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చీపురుపల్లి: వైసిపి జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో కార్యకర్తలు నాయకులు ఆదివారం చీపురుపల్లి పట్టణంలోని 20 వార్డులలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అమలు చేసిన సంక్షేమంతో పాటు రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. గడిచిన ఐదేళ్లలో చీపురుపల్లి నియోజకవర్గంలో మంత్రి బొత్స సత్యన్నారాయణ, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌లు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణ, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌లు పోటీ చేస్తున్నారని వారిని ఆదరించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీమసింగిలో బొత్స ఎన్నికల ప్రచారం

జామి : మండలంలోని బీమసింగిలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ జీ. రవికుమార్, గ్రామ సర్పంచ్ వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామంలోని ఇంటింటికీ తిరిగి, ఎమ్మెల్యే ప్రభుత్వ పాలనను వివరించారు. సంక్షేమ పాలన చూసి, వైసిపికి మరోసారీ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో జెడ్ పిటిసి సరయు, ఎంపిపి అరుణ, డిసిసిబి డైరెక్టర్ పి.సంజీవు, గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

సీతంపేటలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

సీతంపేట : సీతంపేటలో ఆదివారం ఎన్నికల ప్రచారం జోరుగా జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పాలకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే, విశ్వాసరాయి కళావతి, ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజారాణి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారంలో ముందుంటున్నారు. సీతంపేటలో ప్రతి గడపకూ వెళ్తూ, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తు, వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటు ఎన్నికల ప్రచారంను కొనసాగిస్తున్నారు.



చొల్లంగిపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుమారులు

కెజిపూడిలో కోళ్ల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - వేపాడ

మండలం లోని కొండ గంగుపూడి పంచాయతీలో టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఆదివారం ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఎమ్మెల్యేగా తనకు, ఎమ్‌పిగా శ్రీభరత్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధిని విస్మరించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం తప్ప ఏమి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పి. రమణ, ప్రధాన కార్యదర్శి రమణమూర్తి, రాష్ట్ర ఎస్‌సిసెల్ మెంబర్ దాసరి లక్ష్మి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



బొబ్బిలి : 18వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి బేబినాయన

కొండపల్లి శ్రీనివాస్ ఇంటింటి ప్రచారం

గజపతినగరం: మండలంలోని పురిటిపెంటలో ఆదివారం ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో టిడిపి అవసరం ప్రజలకు చాలా ఉందని రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ప్రజలందరూ సహకరించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ముందుగా అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యాలయాన్ని 20 రోజుల్లో పూర్తి చేయడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అందరికీ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. సిఎం జగన్ పై జరిగిన రాళ్ళ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కానీ ఇది మరో కోడి కత్తి డ్రామా -2 మాదిరి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అట్టాడ లక్ష్మము నాయుడు, చప్ప చంద్ర శేఖర్, కొండపల్లి భాస్కర్ నాయుడు, గోపాల్ రాజు, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, బండారు బాలాజీ మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా : బేబినాయన

బొబ్బిలి: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన అన్నారు. మున్సిపాలిటీలోని 18వ వార్డులో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, బాబు పాలూరి, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

చీపురుపల్లి: మెరకముడిదాం మండలం రామాయవలస పంచాయతీకి చెందిన మాజీ ఎంపిటిసి రామవరపు తవుడు, వార్డు మెంబర్ శనపతి అప్పలనాయుడు, అక్కినపల్లి కామయ్య, గేదేల ఆదినారాయణ, బొత్స బలరాము, బాసి రాము, శనపతి హరికృష్ణ, గంటాన గురయ్య, బొత్స ఏసులు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో ఆదివారం చేరారు. వీరికి చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు.

మీతోనే ఉంటా :జయకృష్ణ

పాలకొండ: మీతోనే ఉంటా... మాతో నడవండి అంటూ జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఓటర్లను కోరారు. ఆదివారం అంపిలి, అన్నవరం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. గ్రామాలు అభివృద్ధి జరగాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. నాగావళి నదిలో వైసీపీ నాయకులు ఇసుకను దోచుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె. అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గండి రామినాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంటా సంతోష్, జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు, బిజెపి నాయకులు సునీత ఉన్నారు.



వేపాడ : కెజ పూడిలో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి కోళ్ల లలితకుమారి

రాష్ట్ర విభజన సందర్భంగా జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్క హామీ కూడా నెరవేరలేదు. పైగా కేంద్ర వైఖరి వల్ల ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలు, ఉపాధి మార్గాలు కోల్పోవాల్సి వచ్చింది. జిల్లా అభివృద్ధి మూడు అడుగులు ముందుకు ఆరడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. దీనిపై రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లపాటు అధికారం చెలాయించిన వైసిపి గానీ, ప్రతిపక్ష టిడిపి గానీ ప్రశ్నించడం లేదు. జనసేన మరో అడుగు ముందుకు వేసి బిజెపికి భజన చేస్తూ వస్తోంది. దీంతో, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అభివృద్ధి మరింత ప్రశ్నార్థకంగా మారింది.



నెరవేరని విభజన హామీలు

● బిజెపిని ప్రశ్నించని టిడిపి, జనసేన
● వైసిపిదీ అదే తీరు ● ఎన్నికల వేళ సర్వత్రా చర్చ


గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సిఎం జగన్, కేంద్రమంత్రి, సిటియు విసి (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలతోపాటు జిల్లాలో పలు కార్యక్రమాలకు కూడా నాటి టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వాలు కూడా హామీలు గుప్పించాయి. విజయనగరం ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక నగరాన్ని నిర్మిస్తామని, ఫుడ్‌పార్కులు, ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ పార్కు ఏర్పాటు చేస్తామని, గిరిజన యూనివర్సిటీని నిర్మిస్తామని, విజయనగరాన్ని స్మార్ట్ సిటీగా తయారు చేస్తామని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం హామీలు గుప్పించింది. అటు పూసపాటిరేగ తీరంలో మినీ పోర్టు ఏర్పాటు చేస్తామని నమ్మబలికింది. విద్యల నగరమైన విజయనగరంలో సంగీత, లలిత కళల అకాడమీ ఏర్పాటుకు హామీ ఇచ్చింది. దీంతోపాటు వెనుకబడిన జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని వైసిపి, టిడిపి ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని కూడా చెప్పాయి. ఇవేవీ ఆచరణలో నెరవేరక పోవడంతో ప్రస్తుతం ఎన్నికల ఈనేపథ్యంలో ఈ నాలుగు పార్టీల తీరుపైనా, అవకాశవాదంపైనా సర్వత్రా చర్చ నడుస్తోంది. ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పూర్తిగా వ్యవసాయ ఆధారితంగా మనుగడ సాగిస్తున్నాయి. వర్షాలకు కొదవలేదు. కానీ, సాగునీటి వనరులను అభివృద్ధి చేయకపోవడం వల్ల నీరంతా వృథాగా పోతోంది. దీంతో మన జిల్లాకు వ్యవసాయ రంగం ద్వారా కేవలం 41.2 శాతం మాత్రమే వస్తోంది. ఈ వెనుకబాటును అధిగమించేందుకు కేంద్రం సాయం చేయకపోవడంతో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పనులు పడకేసింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఏటా కేటాయింపులు తప్ప ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో తోటపల్లి ప్రాజెక్టు లక్ష్యం నీరుగారుతోంది. 16 ఏళ్లు కావస్తున్నా రామతీర్థసాగర్ పనులు ముందుకు సాగడం లేదు. అటు ఫుడ్ పార్కుల హామీ నెరవేరలేదు. అటు పారిశ్రామిక, సేవా రంగాల్లోనూ వెనుకబాటు ఉంది. జిల్లాకు వస్తున్న ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా పారిశ్రామిక రంగంలో అభివృద్ధి 15.9 శాతంగా ఉంది.

ఈ నేపథ్యంలో జిల్లాలో పారిశ్రామిక నగరాన్ని ఏర్పాటు చేస్తామని, ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ పార్కు హామీ ఇచ్చినప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. పైగా కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల జిల్లాలో జ్యూట్, చక్కెర పరిశ్రమలు మూతపడ్డాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో సుమారు 30వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. మరోవైపు విజయనగరం జిల్లా కేంద్రంలోని విటి అగ్రహారం, బొబ్బిలి గ్రోత్‌సెంటర్, సారిపల్లి, కంటకాపల్లి పారిశ్రామిక వాడల్లో అనేక పరిశ్రమలు కనుమరుగయ్యాయి. మరికొన్ని ప్లాట్లలో అసలు పరిశ్రమలే ఏర్పాటు చేయలేదు. ఇలా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పారిశ్రామిక రంగంలో రాష్ట్రంలోనే వెనుకబడ్డాయనడంలో సందేహం లేదు. గిరిజన వర్సిటీ అడ్మిషన్లు ప్రారంభించి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ శాశ్వత ప్రాతిపదికన భవన సముదాయం నిర్మాణానికి చర్యలు తీసుకోలేదు. స్థల గుర్తింపు, సేకరణ పేరుతో ప్రభుత్వం ఇన్నాళ్లూ కాలక్షేపం చేసింది. గతేడాది వర్సిటీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినా అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయలేదు. దీంతో తరగతులు, ప్రయోగాలు పరాయి పంచన సాగుతున్నాయి. జిల్లాలో పోర్టు నిర్మాణం విషయమై కనీస ప్రస్తావన లేదు. పూసపాటిరేగ తీరంలో పోర్టుకు బదులు ఫ్లోటింగ్ జెట్టీతో సరిపెట్టారు. సిఎం శంకుస్థాపన చేసి ఏడాది గడుస్తున్నా పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇలా కేంద్రం ఓవైపు రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా, ప్రజలపై ఆర్థిక భారాలు మోపిందని, ప్రజావ్యతిరేక చట్టాలు రూపొందించిందని జనం చర్చించుకుంటున్నారు. గడిచిన పదేళ్లలో ఇటువైసిపి, అటు టిడిపి కూడా కేంద్రానికి సహకరించాయి తప్ప హామీలపై గానీ, ప్రజలపై మోపిన భారాలపై గానీ నోరు మెదపలేదని సర్వత్రా చర్చ నడుస్తోంది. ఈనేపథ్యంలో 'వాడు కాకపోతే వీడు... వీడు కాకపోతే వాడు...' అన్నట్టుగా కాకుండా ఈసారి ప్రత్యామ్నాయం ఆలోచిస్తే తప్ప ప్రజల ఇబ్బందులు పరిష్కారమయ్యే పరిస్థితులు కనిపించడం లేదని చర్చ సాగుతోంది.


సిటియు స్థలంలో ఇంకా ప్రారంభం కాని నిర్మాణ పనులు

వాలంటీర్ల చుట్టూ రాజకీయం

జిల్లాలోని రాజకీయాలు గ్రామ, వార్డు వాలంటీర్ల చుట్టూ తిరుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో తామంతా వైసిపికి మద్దతుగా ప్రచారంలో పాల్గొంటామని వాలంటీర్లు బహిరంగంగా చెబుతూ రాజీనామాలు చేస్తున్నారు. మరోవైపు ఎన్నికల ప్రచారం కోసం వాలంటీర్ ఉద్యోగాలకు రాజీనామా చేయాలని వైసిపి నాయకులు ఒత్తిడి చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో జరుగుతున్న పరిణామాలు కూడా అందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి.


బాడంగి మండలం కోడూరులో వైసిపి నాయకులతో కలిసి రాజీనామా పత్రాలను చూపిస్తున్న వాలంటీర్లు

● వాలంటీర్ల చుట్టూ రాజకీయం
● ఇప్పటికే 708 మంది రాజీనామా
● ఎన్నికల్లో పని చేయాలని ఒత్తిడి!

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లాలో వాలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 530 సచివాలయాల్లో 9,187 మంది వాలంటీర్లు ఉన్నారు. అందులో ఈ నెల 13వ తేదీకి మొత్తం 708 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. వీరిలో 139 మంది శనివారం ఒక్కరోజే రాజీనామా పత్రాలను సమర్పించారు. వాలంటీర్ ఉద్యోగాలకు రాజీనామా చేసిన వారిలో బొబ్బిలి నియోజక వర్గంలో 59 మంది, చీపురుపల్లిలో 10, గజపతి నగరంలో 149, నెల్లిమర్లలో 280, రాజాంలో 95, ఎస్.కోటలో 61, విజయనగరంలో 36, సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ మండలంలో 18 మంది ఉన్నారు. మరో 16 మంది వాలంటీర్లపై ఫిర్యాదులు రావడంతో వారిని ఇంతకుముందే తొలగించారు. రేగిడి మండలంలో ఒక్కరు కూడా రాజీనామా చేయకపోవడం గమనార్హం. వాలంటీర్ ఉద్యోగాలకు రాజీనామా చేసి వైసిపి గెలుపునకు పని చేస్తే, అధికారంలోకి వచ్చాక వేతనాలు పెంచి మళ్లీ వారినే నియమిస్తామని ఒత్తిడి చేయడంతో రాజీనామా చేస్తున్నట్లు సమాచారం.

రాజీనామాకు ముందుకురాని వాలంటీర్లు

వాలంటీర్ పోస్టులకు రాజీనామా చేయాలని వైసిపి నాయకులు వార్డు, గ్రామ వాలంటీర్లపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయినా రాజీనామా చేసేందుకు కొంతమంది వాలంటీర్లు ముందుకు రాలేదు. అధికార పార్టీ నేతల ఒత్తిడి తట్టుకోలేక అక్కడక్కడ మాత్రమే వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు తెలిసింది.

అధికార పార్టీ నేతలకు రాజీనామాలు

వాలంటీర్ పోస్టులకు రాజీనామా చేసిన వాలంటీర్లు రాజీనామా లేఖలను సచివాలయ అడ్మిన్లకు, కార్యదర్శులకు అందజేయాల్సి ఉంది. కానీ అధికార పార్టీ నాయకులకు కొన్నిచోట్ల అందజేయడం గమనార్హం. మరికొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులతో కలిసి వచ్చి రాజీనామాలు సమర్పించడం విశేషం. తెర్లాం మండలం కుసుమూరు గ్రామానికి చెందిన చెందిన 10 మంది వాలంటీర్లు రాజీనామా చేసి వైసిపి మండల అధ్యక్షులు తెంటు సత్యంనాయుడుకు అందజేశారు. బాడంగి మండలం కోడూరు రెండు సచివాలయాల్లో పని చేస్తున్న 28మంది వాలంటీర్లు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వైసిపి నాయకులు తెంటు మధు సమక్షంలో వారు రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. దీనిని బట్టి రాజీనామా చేయాలని ఎంత బలవంతం చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.


జనసేనలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న లోకం మాధవి

వైసిపికి ఎదురుదెబ్బ

జనసేనలో నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్, ఇద్దరు రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, సర్పంచ్‌లు చేరిక

ప్రజాశక్తి - భోగాపురం

నియోజకవర్గంలో వైసిపిని వీడి జనసేనలోకి ఆదివారం సాయంత్రం భారీగా చేరికలు జరిగాయి. నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్‌తో పాటు భోగాపురం మండలం నుంచి ఇద్దరు కార్పొరేషన్ డైరెక్టర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, గతంలో పోటీ చేసి ఓడిపోయిన సర్పంచులు, నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. వీరికి కూటమి అభ్యర్థి లోకం నాగ మాధవి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన చైర్ పర్సన్ బంగారు సరోజిని, భోగాపురం మండలానికి చెందిన గూడెపువలస సర్పంచ్ మట్టా అయ్యప్ప రెడ్డి, రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లుబోయిన నర్సింగరావు, రాష్ట్ర మత్స్యకార సొసైటీ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు, మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ మదీనా వైసిపిని వీడి జనసేనలో చేరారు. కాకర్ల పూడి శ్రీనివాసరాజు, ఉత్తరాంధ్ర మహిళా కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీ రాజ్, మాజీ జెడ్‌పిటిసి కంది సూర్యనారాయణ, న్యాయవాది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి చేరుకున్న ఇవిఎంలు

ప్రజాశక్తి- బొబ్బిలి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బొబ్బిలి అసెంబ్లీ పోలింగ్‌కు సంబంధించిన ఇవిఎంలు ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకున్నాయి. 343 వివి ప్యాట్స్, 316 బాలట్ యూనిట్స్, 316 కంట్రోల్ యూనిట్స్ ఆర్‌డిఒ కార్యాలయానికి రావడంతో తాత్కాలిక స్ట్రాంగ్ రూములో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ భద్రపరిచారు. రెండు రోజుల్లో పార్లమెంటు పోలింగ్‌కు సంబంధించిన ఇవిఎంలు రానున్నట్లు ఆర్‌ఒ చెప్పారు.

ఘనంగా దేశతల్లి వారోత్సవాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

ఆరికతోటలో వెలసిన బాల మజ్జిగౌరితల్లి పండగ ఈ నెల 23న జరగనుంది. ఆ తల్లి ఉత్సవశోభకు ముందుగా దేశమ్మ తల్లి వారోత్సవాలు జరపడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆదివారం కనకల రామన్న వారి కుటుంబాలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పసుపు, కుంకుమ, కోడి, కోళలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వచ్చే వారం జరిగే బాలమజ్జి గౌరి ఉత్సవాలు, తిరువీధి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్జిగౌరి ఉపాసకులు కనకల పాపారావు, సన్యాసప్పడు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని కుసుమూరు గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లు రాజీనామా చేశారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించేందుకు తామంతా పనిచేస్తామని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఉదయం లేఖలు రాసి రాజీనామాలను ఎంపిడిఒకు పంపారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు తెంటు సత్యం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మాక్ పాలీసెట్ విజేతలకు బహుమతులు ప్రధానం చేసినట్లు లక్ష్య ఫౌండేషన్ నిర్వాహకులు చీమలపాటి శర్మ, అజ్జాడ నరేష్, వెంపడాపు ఈశ్వరరావు, రహీమ్ షేక్ లాల్ తెలియజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన అసిస్టెంట్ ఇంజనీర్లు విజయ్ కుమార్, రేవతి, సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు మోపాడ సన్యాసిరావు, కర్రి పవిత్ర లహరి, మండ సత్యసాయితి చేతులు మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఆదివారం స్థానిక చైతన్య జూనియర్ కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 295 మంది విద్యార్థుల పాల్గొన్నారు. మాక్ పాలీసెట్ పరీక్షలో ప్రథమ స్థానం సాధించిన జామి మండలం కుమరాం విద్యార్థిని వి.యశ్విత రూ.5వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థి ఎస్ కార్తీక్ (అలమండ)కు రూ.3వేలు, తృతీయ స్థానం సాధించిన మదనాపురం ఎపి మోడల్ స్కూల్ విద్యార్థి బి.వనితకు రూ.2వేలు చొప్పున నగదు అందజేసినట్లు తెలిపారు. వీరితో పాటు మంచి ప్రతిభ కనబరిచిన పి.సౌభాగ్య (నెల్లిమర్ల)కు రూ.2వేలు మెమొంటో, షీల్డ్, ధ్రువపత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీమలపాటి శర్మ, అజ్జాడ నరేష్, వెంపడాపు ఈశ్వరరావు, రహీమ్‌షేక్‌లాల్, గాయత్రి, కొట్యాడ శ్రీనివాసరావు, అవతారం, శివరామకృష్ణ, గూనూరు వెంకటరావు, కిరణ్, సిహెచ్ సునీల్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి కోడ్ ఉల్లంఘన

ప్రజాశక్తి- డెంకాడ

ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఎన్నికల నిబంధనలను పాటించకుండా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు వివిధ పార్టీ అభ్యర్థులతో కలిసి తిరగడం కలకలం రేపుతోంది. వాస్తవానికి ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి రాజకీయ నాయకుల సమావేశాలు, సభలు, కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. కాదని తిరిగిన వారిపై విచారణ చేసి సస్పెండ్ చేస్తారనడంలో సందేహం లేదు. ఇవన్నీ తెలిసినా మండలంలోని ఒక సచివాలయ ఉద్యోగి బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థి కర్రి కృష్ణ, వారి అనుచరులతో కలిసి ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడ జరిగిన సమావేశంలో పాల్గొని అందరినీ ఆశ్చర్యపరిచాడు.

మండలంలో గునుపూరులో బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థి కర్రి కృష్ణ తన అనుచరులతో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇందులో భాగంగా అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు గునుపూరుపేట సచివాలయంలో కార్యదర్శిగా పనిచేస్తున్న బి లక్ష్మణరావు పాల్గొని అంబేద్కర్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయడం తప్పు కాకపోయినా ఒక పార్టీ నాయకులతో వెళ్లి వేయడం, తరువాత ఆ పార్టీ తరుపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. గ్రామంలో జరిగిన సమావేశంలో బిఎస్‌పి నాయకులతో కలిసి కూర్చోవడం తో కార్యదర్శి పై గునుపూరు పేట గ్రామానికి చెందిన పలువురు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. పార్టీ కండువాలు వేసుకున్న వారితో ఎలా సమావేశంలో పాల్గొంటారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎన్నికల అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థితో కలిసి ప్రచారం



బిఎస్‌పి సమావేశంలో పాల్గొన్న కార్యదర్శి (వృత్తంలో ఉన్న వ్యక్తి)

అధిష్టానం ఆదేశాలు పాటిస్తారా?

ఇండిపెండెంట్‌గా పోటీ చేయమంటారా?

ప్రజాశక్తి - వేపాడ

అధిష్టానం ఆదేశాలను పాటిస్తారా? లేకపోతే ఇండిపెండెంట్ అభ్యర్థిగా తనను రంగంలోకి దిగమంటారా? అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి దంపతులను హెచ్చరించారు. మండలంలోని బానాది గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు స్వగృహంలో టిడిపి నాయకులు గొంప కృష్ణ, కోళ్లలలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోళ్ల బుచ్చి రాంప్రసాద్, మండల కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ అధిష్టానం అందరినీ కలుపుకొని పనిచేయాలని చెబితే మీరు కనీసం మండలంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలను మండల అధ్యక్షుడు గొంప వెంకటరావుకు కూడా చెప్పడం లేదని, గ్రామాల్లో ప్రచారాలు నిర్వహిస్తున్నా తమ గ్రూపుకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని కోళ్ల లలితకుమారిని ప్రశ్నించారు. ఈ విధానాన్ని మార్చుకోకపోతే తాను ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయడం తథ్యమని చెప్పారు. అందుకు కోళ్ల దంపతులు మాట్లాడుతూ ఇక మీదట అలా జరగదని రేపటి నుంచి జరిగే ప్రతి కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరావుకు చెబుతామని చెప్పారు. అందరం కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు గుమ్మడి భారతి, పి.రమణ, కె. రమణమూర్తి, పాల్గొన్నారు.

కోళ్ల లలితకుమారికి గొంప హెచ్చరిక

వారోత్సవాలు ప్రారంభం

శృంగవరపుకోట: రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ, జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను మండల కేంద్రంలో గల అగ్నిమాపక కార్యాలయ అధికారి షేక్ మదీనా ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుండి 20 వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. వారోత్సవాల్లో మొదటి రోజు ఆదివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక శాఖ జెండా ఎగురవేస్తూ, భారతదేశంలో వివిధ రాష్ట్రాలలో ప్రాణత్యాగం అయినా బెచు యాదవ్, బీహార్ ఫైర్ సర్వీస్, రంజిత్ జెఎస్, కేరళ, ఫైర్ అండ్ రెస్క్యూ ఆఫీసర్, సతీష్ తెరోన్, ఎస్ఒ అస్సాం ఫైర్ సర్వీస్, వారికి నివాళులు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

వైసిపికి మరోసారి అవకాశమివ్వండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉత్తరాంధ్ర అభివృద్ధికి వైసిపికి మరోసారి అవకాశం ఇవ్వాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం మొయిద విజయరాంపురంలో వైసిపి మండల, నగర పంచాయతీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేకంగా ఉత్తరాంధ్రను అభివృద్ధి బాటలో నడిపించి భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం చేశారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు సాధించి విశాఖపట్నం రాజధానిగా చేయడం ఖాయమన్నారు. ఎమ్‌పిగా బెల్లాన చంద్ర శేఖర్, ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పల నాయుడుని గెలిపించాలని కోరారు. ప్రతిపక్షం అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారు ఎన్నికల తరువాత మరి కనిపించరని వారు విదేశాలకు వెళ్ళిపోతారని విమర్శించారు. ఆ పార్టీల్లోకి వెళ్తున్న వారు డబ్బు మీద ఆశతో వెళ్తున్నారు తప్పు ఒరిగేదేమీ లేదన్నారు. ప్రతిపక్షాలు ఓటమి భయంతో సిఎం జగన్ మోహన్ రెడ్డి మీద దాడులకు పాల్పడుతున్నారని వైసిపి మరో సారి ప్రజల అండతో గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం పరిశీలకులు నెక్కల నాయుడు బాబు, ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు బెల్లాన చంద్ర శేఖర్, బడ్డుకొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబల్ల శ్రీరాముల నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు చనమల్ల వెంకటరమణ, పూసపాటి రేగ, డెంకాడ, భోగాపురం నాయకులు పతివాడ అప్పలనాయుడు, బంటుపల్లి వాసు దేవ రావు, కందుల రఘు బాబు, పూసపాటి రేగ ఏఎంసి చైర్‌పర్సన్ చిక్కాల అరుణ కుమారి, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతి వాడ సత్య నారాయణ, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారు కొండ కృష్ణ, నాయకులు మత్స సత్య నారాయణ, బడ్డుకొండ మనిదీప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

అంబేద్కర్‌కు డిప్యూటీ సిఎం నివాళి

ప్రజాశక్తి - సాలూరు

అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలో పలుచోట్ల అంబేద్కర్ విగ్రహాలకు డిప్యూటీ సిఎం రాజన్నదొర పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంగారమ్మపేట, పిఎన్ బొడ్డవలస గ్రామాల్లో స్థానిక దళిత నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం రాజన్నదొర అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంగారమ్మపేటలో కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. బొడ్డవలసలో స్థానిక నాయకులు తేగల బలరాం ఆధ్వర్యాన నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పెదహరిజనపేట, రెల్లివీధుల్లో స్థానిక కౌన్సిలర్లు జి.వరప్రసాద్, సువర్ణమ్మ నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని చినహరిజనపేటలో కౌన్సిలర్ లింగాల దుర్గా, మాజీ కౌన్సిలర్ ఎం.అప్పారావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నా రు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్‌చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్పీ చింతగడ దాసు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో....

పార్వతీపురం టౌన్ : చరిత్ర ఉన్నంతకాలం బిఆర్ అంబేద్కర్ పేరు శాశ్వతంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నాడు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అంబేద్కర్ తన జీవితకాలం పోరాటం చేశారని, దళితుల పట్ల నాడు ఉన్న వివక్షను రూపుమాపేందుకు ఆయన చేసిన పోరాటం మరువలేనిదని, అంటరానితనం గురించి ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో డిఇ కిరణ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సి హెచ్.మురళి, ఎఎస్ఒ వీరి నాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు..

కురుపాం : బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని కురుపాంలోని టిడిపి కార్యాలయంలో ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేష్ చంద్ర దేవ్, రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి దత్తి లక్ష్మణ రావు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన మండల కన్వీనర్లు కె వి కొండయ్య , ఎన్.వంశీ, టిడిపి జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : అంబేద్కర్ ఆశయాలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం యాలాం జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే అనేక మందికి మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంతి డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, పాలవలస దవలేశ్వరరావు, లిల్లీ పుష్పనాధం, వెలమల మన్మధరావు, నీలాపు శ్రీను, మరియ దాసు, తదితరులు ఉన్నారు.

స్థానిక శాఖా గ్రంథాలయంలో :

స్థానిక శాఖా గ్రంథాలయంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి భరత్ భూషన్ రాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బి.గణేష్ బాబు, శివకృష్ణ, ఆనంద్, ఈశ్వర్, తదితరులు ఉన్నారు.

వీరఘట్టం : మండలంలోని ఆదివారం బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేగులపాడు, నడుకూరు, ఎం.రాజపురం, తూడి, నీలానగరం, తలవరం, తెట్టంగి, చిట్టపూడివలస తదితర గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎ.వెంకట్రావు, రాంకుమార్, డి.శ్రీనుబాబు, జనసేన జానీ, ఎం పుండరీకం , అచ్యుత తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : పట్టణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి టిడిపి అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఇందిరా హరిజన కాలనీ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నాయకులు కార్యకర్తలు శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. అలాగే ఆసుపత్రి కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి యుటిఎఫ్ నాయకులు నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి
సోమవారం 15 ఏప్రిల్ 2024

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాలి



సీతంపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - సీతంపేట

అంబేద్కర్ ఆశయాలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకునేందుకు మతోన్మాద బీజేపీని, దానికి ప్రత్యక్ష, పరోక్ష మద్దతు ఇస్తున్న పార్టీలను ఓడించాలని సిపిఎం జిల్లా కమిటీ కార్యదర్శి రెడ్డి వేణు, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింహాచలం, మండల కార్యదర్శి ఎ.భాస్కరరావు పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సీతంపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని, బడుగు బలహీన వర్గాలకు కల్పిస్తున్న రిజర్వేషన్లను కూడా నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. అటువంటి బిజెపికి, రాష్ట్రంలో వైసిపి, తెలుగుదేశం, జనసేన మద్దతిచ్చి బలపర్చడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రగతిశీల వామపక్ష, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించి దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకై, రాజ్యాంగ పరిరక్షణకై పూనుకోవాలని పిలుపునిచ్చారు. ఈ విధానా లకు రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు, కార్యకర్తలు సాంబయ్య, వెంకట్ రమేష్ పాల్గొన్నారు.

బలిజిపేట : బలిజిపేట, పరగర గుడివాడ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి మండలంలోని అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.మన్మథరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యమ్మల మన్మథరావు, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బిజెపిని, దాన్ని బలపరిచే పక్షాలను ఓడించాలని, ప్రగతిశీల వామపక్ష అభ్యర్థులను గెలిపించి దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకై పూనుకోవాలని పిలుపనిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంట్యాడ బలరాం, ఆవు సాంబమూర్తి, వీసా వెంకటస్వామి, భానుమూర్తి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గుడివాడ రాము, సైలాడ ఆదినారాయణ, గుడివాడ లక్ష్మణం, అప్పయ్య, సంగమేశం, పాలీల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మర్రి శ్రీనివాసరావు కురుకూటిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బిజెపిని, దాన్ని బలపరిచే పక్షాలను ఓడించాలని, ప్రగతిశీల వామపక్ష అభ్యర్థులను గెలిపించి దేశ ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకు పూనుకోవాలని పిలుపనిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గెమ్మెల జానకీరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు చందాపురం అప్పన్న, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అయోధ్య, మర్రి లుబ్బు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బాగువలస హరిజనపేట ప్రాథమిక పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి ఉపాధ్యాయురాలు రాజమణి పూలమాల వేసినివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పాచిపెంట : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిఐటియు, గిరిజన సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు చింత పోలిరాజు, బోను గౌర్నాయుడు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుతూ అంబేద్కర్ ఆశయాలు తీసుకెళ్లడమే అంబేద్కర్ ఇచ్చిన ఘనమైన నివాలని అన్నారు.

పాలకొండ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకొని రాజ్యాంగంలో కార్మికులకు పొందుపరిచిన హక్కులను నాశనం చేస్తున్న శక్తులకు వస్తున్న ఎన్నికల్లో కార్మిక వర్గం బుద్ధి చెప్పాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు కార్మికులను కోరారు. పాలకొండలో సిఐటియు విస్తృతస్థాయి సమావేశం మండల నాయకులు కాద రాము, జి.జెస్సిబాయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమణరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పాలకవర్గాల్లో ఉన్న కొన్ని శక్తులు నాశనం చేయాలని చూస్తున్నాయని, కులాలు, మతాల వారీగా ప్రజలను ఐక్యం కాకుండా చూస్తున్నాయని, కార్మిక వర్గం చైతన్యవంతంగా ఆలోచించి ఈ దాడులను తిప్పికొట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎ.పద్మావతి, కె.గౌరీశ్వరి, ఆర్.భవాని, సిహెచ్ సురేష్, వై.శ్రీనివాసు, డి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని వెంకట భైరిపురంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా భారత రాజ్యాంగాన్ని రక్షించుకుం దాం మతోన్మాద బిజెపి ఎన్‌డిఎ కూటమిని ఓడిద్దామంటూ సిపిఎం నాయకులు వి.ఇందిర పిలుపునిచ్చారు. ప్రజల తరపున పోరాడే ఎర్ర జెండా అరకు పార్లమెంటు ఎంపీ అభ్యర్థిగా పాచిపెంట అప్పలనరసను ప్రజలంతా గెలిపించాలని కోరారు.

సాలూరు: డాక్టర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగంపై దాడులు చేస్తున్న శక్తుల్ని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు కోరారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు రాముడు, శంకరరావు పాల్గొన్నారు.



బలిజిపేట : అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

పార్వతీపురంరూరల్ : మండలంలోని రావికోనలో గల రంగాలగూడలో అంబేద్కర్ జయంతి ఘనంగా జరిగింది. సర్పంచ్ కె.రామస్వామి మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు కె.శంకర్రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

సీతానగరం: పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ ద్వారానే ఆయనకు మనం ఇచ్చిన నిజమైన ఘన నివాళులని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రమణమూర్తి, శ్రామిక మహిళా సంఘం నాయకులు వెన్నెల రామలక్ష్మి, వై.శాంతి కుమారి. బోరపరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భామిని: భామిని మండలం లోని ఘనసారలో సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతోత్సవాలు జరిగాయి. సిపిఎం మండల కన్వీనర్ జగన్నాయకులు, కమిటీ సభ్యులు మిన్నరావు అంబేద్కర్ విగ్రహం కి పాలాభిశేఖం చేసి, కేక్ కట్ చేసి, పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమం స్థానిక యువత పాల్గొన్నారు.

కొమరాడ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాక్షిగా రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు బిజెపిని, దాని మిత్రపక్షాలను ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాకాడ ఇందిరా పిలుపునిచ్చారు. కొమరాడలోని పాత దళిత వీధి, కొమరాడలో సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, విశ్రాంత ఉపాధ్యాయులు వర్మ, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గొర్లి గంగరాజు, అంబేద్కర్ యువజన సంఘం యూత్ సభ్యులు నడుకూరు లక్ష్మణరావు, సిపిఎం నాయకులు జగన్నాథం, శివుని నాయుడు, సింహాచలం, వెంకటేశు, భవన కార్మిక సంఘం నాయకులు ఏసు, వెంకట్ నాయుడు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ప్రసాదు, తిరుపతిరావు, రవణ, పోలి నాయుడు, గిరిజనులు, దళితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జియ్యమ్మవలసలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

జియ్యమ్మవలస : జియ్యమ్మవలసలో అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగు నాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బిజెపిని, బిజెపిని బలపర్చే పక్షాలను ఓడించాలని, ప్రగతిశీల వామపక్ష అభ్యర్థులను గెలిపించి దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు పూనుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు భూతల మోహన్‌రావు, గరుగు బిల్లి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : అంబేద్కర్ జయంతి సందర్భంగా మండలంలోని నాగూరులో అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు బివి రమణ, కరణం రవీంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బిజెపిని, బిజెపిని బలపరిచే పక్షాలను ఓడించాలని, ప్రగతిశీల వామపక్ష అభ్యర్థులను గెలిపించి దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకై పూనుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.గణపతి, శివ, మౌళి తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ :అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

గిరిజనుల హక్కులను కాలరాస్తున్న బిజెపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే బిజెపి, దాని మిత్రులను రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించినప్పుడే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు ఘనమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ అన్నారు. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గోడపత్రికలతో నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన సాగిస్తూ, గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను కాలరాస్తూ పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. తరతరాల నుంచి అడవినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఏజెన్సీలో నూటికి నూరు శాతం ఉద్యోగాల కోసం తీసుకువచ్చిన జిఒ 3ను రద్దు చేశారని అన్నారు. 1/70 చట్టానికి రక్షణ లేకుండా పోయిందన్నారు. అటవీ హక్కు చట్టంలో పోడుపై హక్కుల కోసం గిరిజనులకు పూర్తిస్థాయిలో పట్టాలు ఇవ్వలేదన్నారు. గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన జిసిసి, ఐటిడిఎ సంస్థలు దిష్టిబొమ్మలుగానే మిగిలాయన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక గిరిజన యువత వలసలు వెళ్లిపోయే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం పట్టని ప్రభుత్వాలకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం అభ్యర్థి మండంగి రమణ, సిపిఎం మండల కార్యదర్శి పువ్వల తిరుపతి, నాయకులు పువ్వల మోహన్ రావు, సన్యాసిరావు, బిడ్డిక శంకర్రావు, సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం నిరసన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

అభ్యర్థి మార్పుపై ఎఐసిసి నాయకుడి హామీ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మార్పుపై ఎఐసిసి పరిశీలకులు చౌహాన్ హామీ ఇచ్చారని ఆశావహ అభ్యర్థి గేదెల రామకృష్ణ చెప్పారు. ఆదివారం విజయనగరంలో పార్టీ పరిశీలకులు చౌహాన్‌ను గేదెల రామకృష్ణ కలిసి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి పిసిసి చీఫ్ షర్మిలతో మాట్లాడి మార్పుపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారని తెలిపారు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సిగడాపు బంగారయ్య, ద్వారపు రెడ్డి పుండరీకాక్ష నాయుడు కూడా ఎమ్మెల్యే అభ్యర్థి మార్పు గురించి చెప్పినట్లు తెలుస్తోంది.



నాసిరకం చోడిపంఇని చూపుతున్న గిరిజనులు

రేషన్ డిపో రాగిపిండిపై గిరిజనుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా సరఫరా చేస్తున్న రాగిపిండి నాణ్యత సక్రమంగా లేదంటూ మండలంలోని లిడికివలసతో పాటు, గోచెక్క, డోకిశీల పంచాయతీలకు చెందిన గిరిజనులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం డిపో ద్వారా తీసుకున్న రాగి పిండిని ప్రదర్శిస్తూ గ్రామానికి చెందిన తాడంగి సాయిబాబు, ఉర్లక నాగార్జున, ఆరిక ప్రభాకర్ మాట్లాడుతూ ఈనెల రేషన్ బియ్యం శనివారం పంపిణీ చేశారని, కేజీ బియ్యం కట్ చేసి, కేజీ రాగి పిండి ఇచ్చారని అన్నారు. కేజీ రాగి పిండికి రూ.15 తీసుకుని రాగి పిండి చాలా పాతది, నాసిరకం, పూర్తిగా ఇసుకతో కూడినది సరఫరా చేశారని తెలిపారు. తింటుంటే ఇసుక తిన్నట్లే ఉందన్నారు. రాగి పిండి అసలు బాగోలేదుని, కేజీ బియ్యం బదులుగా రాగి పిండి ఇస్తామని చెప్పి, రాగి పిండికి రూ.15 వసూలు కూడా చేయడం ఎంత వరకు సమంజసమని గిరిజన సంక్షేమ సంఘం తరుపున అడుగుతున్నామన్నారు. ఈ నెలలో కట్ చేసిన కేజీ బియ్యం వచ్చే నెలలో కలిపి ఇవ్వాలని, జిసిసి అధికారులు దీనిపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

14 మంది వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని ఎమ్మార్ నగరం గ్రామ సచివాలయ పరిధిలోని 14 మంది వాలంటీర్లు తమ రాజీనామాను సమర్పించారు. ఈ మేరకు శనివారం ఎంపిడిఒ అకిబ్ జావేద్‌ను ఆయన కార్యాలయంలో కలుసుకొని ఈ రాజీనామా సమర్పించినట్లు ఆదివారం వారు తెలిపారు. వాలంటీర్లపై జనసేన, టిడిపి, బిజెపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నందుకు నిరసనగా ఈ రాజీనామాలు చేపట్టినట్లు వారు తెలిపారు.

భారీ వాహనాలతో ప్రజలకు అవస్థలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక బజారులో ఎటువంటి అనుమతులు లేకుండా భారీ వాహనాల రాకపోకలతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 80 టన్నులు దాటిన వాహనాలు బజారులో గంటలకొద్దీ ఉంది నిలిపివేయడంతో రద్దీ తిరిగి ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. వ్యాపారులు నిత్యం రోడ్డుపైనే ఐరన్‌ను, సిమెంటు లారీలు రావడంతో ఈ పరిస్థితి దాపురిస్తుందని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు వెడల్పులు చేసి ట్రాఫిక్ సమస్య తీర్చాలని, రోడ్డుపైన ఉన్న రోడ్డుపై వేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

తొలి సంతకం ప్రత్యేక హోదాపైనే

ఎఐసిసి రాష్ట్ర పరిశీలకులు మనోజ్ చౌహాన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపైనే రాహుల్ గాంధీ తొలి సంతకం చేస్తారని ఎఐసిసి రాష్ట్ర పరిశీలకులు మనోజ్ చౌహాన్ తెలిపారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన ఐదు హామీలు, రాష్ట్రంలో ప్రకటించిన 9 హామీలు ప్రధాన ఆయుధమని, వాటి ద్వారానే కర్ణాటక, తెలంగాణలో గెలిచామని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం కాకుండా కాపాడుతామన్నారు. పోలవరం పనులను పూర్తిచేసే బాధ్యత కాంగ్రెస్‌దేనని చెప్పారు. ప్రజస్వామ్యం బతికి ఉండాలంటే కాంగ్రెస్ వల్లే సాధ్యమని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ విశాఖ నాయకులు జిబివిఎస్ కమలాకర్, డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి సుంకర సతీష్ కుమార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రామారావు, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ హాసన్ షరీఫ్, జిల్లా మహిళా అధ్యక్షులు ఉమాదేవి, జిల్లా సీనియర్ నాయకులు ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

17న రామనారాయణంలో సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక రామనారాయణంలో ఈనెల 17న శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఎన్‌సిఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన ప్రతులను ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఉత్సవాన్ని అంతా తిలకించేందుకు గాను ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సిఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం నీరజవల్లి, డైరెక్టర్ గౌరీ నిత్య పాల్గొన్నారు.



ఇవిఎంలను దగ్గరుండి భద్రపరుస్తున్న ఆర్ఒ కల్పనాకుమారి

ఇవిఎంలను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచాం :ఆర్ఒ

ప్రజాశక్తి -పాలకొండ

నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎం యంత్రాలను పాలకొండలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచినట్లు రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఇవిఎంలను రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్రపర్చి సీల్ వేశారు. అలాగే స్ట్రాంగ్ భద్రతను పర్యవేక్షిస్తున్న పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూం ఆవరణలోకి ఇతరులను ఎవర్నీ అనుమతించకూడదని సూచించారు. కార్యక్రమంలో పాలకొండ డీఎస్పీ, ఎస్ఐ, సీతంపేట, పాలకొండ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూములకు చేరిన ఇవిఎంలు

పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి ఎంపీ ఎన్నికకు ఇవిఎంలు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు చేరాయి. కట్టుదిట్టమైన బలగాల మధ్య ఇక్కడికి తీసుకొచ్చారు. డీఎస్పీ జివి కృష్ణారావు, తహశీల్దారు వరహాలు, సిఐ చంద్రమౌళి పర్యవేక్షణలో ఇవిఎంలు దించారు.

వలసల నివారణే లక్ష్యం : శ్రీనుబాబు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉత్తరాంధ్ర జిల్లాల్లో వలసలను అరికట్టడమే తన లక్ష్యమని, ఇందుకోసం ఒక రాజకీయ వేదిక అవసరమని, ఆ వేదిక నిర్ణయం కోసం తాను ఎదురుచూస్తున్నానని పల్సస్ సిఇఒ గేదెల శ్రీనుబాబు తెలిపారు. ఆ రాజకీయ వేదిక నిర్ణయం మరో 48 గంటల్లో తెలుస్తుందని చెప్పారు. అనంతరం తన వైఖరిని ప్రకటిస్తానన్నారు. తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి కేంద్రంలో సరైన ప్రాతినిధ్యం లేనందువల్ల ఇక్కడ వలసలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వలసలు అరికట్టేందుకు, జాతీయ స్థాయిలో తన గళాన్ని ఓ రాజకీయ వేదిక ద్వారా వినిపించేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. విజయనగరం పార్లమెంట్ స్థానాన్ని మార్చే అవకాశం ఉందన్నారు. తనను కొన్ని రాజకీయ పార్టీలు సంప్రదించాయని, నిర్ణయం ఒకట్రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉందని తెలిపారు. బాలాజీ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో బిసి సంఘ నాయకులు ఆనెపు రామకృష్ణ బాబు, తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మజ్జి అప్పారావు, జిల్లా అధ్యక్షులు రొంగలి రామారావు, జిల్లా కార్యదర్శి ముదిలి నాగభూషణరావు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే

బిజెపి, దాని మిత్రులను ఓడించండి

సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

అంబేద్కర్ జయంతి సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిజ్ఞ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని తునా తునకలు చేస్తుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా, కార్మిక, కర్షక హక్కులను పూర్తిగా కాలరాస్తుందని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, లోక్‌సత్తా ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనం నుండి మెయిన్ రోడ్డు మీదుగా గురజాడ జంక్షన్లో గల అంబేద్కర్ విగ్రహం వరకు రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనే నినాదంతో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ మతోన్మాద బిజెపి మూడోసారి అధికారంలోకి వస్తే తప్పకుండా భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి దాని స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తామని బహిరంగ ప్రకటన చేయడం పట్ల రాజ్యాంగ ద్రోహం బిజెపిలో ఇమిడి ఉందని స్పష్టమోతుందని తెలిపారు. ప్రజలకు అబద్ధపు మాటలతో గారడి చేస్తూ, మతోన్మాదపు, కార్పొరేట్ శక్తుల దన్నుతో అధికారం చేజెక్కించుకొని రాజ్యాంగాన్ని మార్చడమే లక్ష్యంగా బిజెపి పెట్టుకుందన్నారు. అలాగే రైతు, కార్మిక, విద్య, ఉపాధి, విద్యుత్తు హక్కులను కూడా కాలరాస్తుందని, ఇది చాలా దుర్మార్గమని మండిపడ్డారు. ఇటువంటి విధ్వంసపు చర్యలకు పాల్పడుతున్న నరేంద్ర మోడీకి రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన వత్తాసుపలకడం దౌర్భాగ్యమన్నారు. కావున భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే బిజెపి దాని మిత్రపక్షాలైన టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించడమే అంబేద్కరుకు ఘనమైన నివాళ్లని ప్రజలకు పిలుపునిచ్చారు. పార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి బత్తిన్న మోహన్ రావు మాట్లాడుతూ బిజెపి పదేళ్ల కాలంలో దేశాన్ని, రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసిందని, గడిచిన పదేళ్లలో బిజెపి దేశానికి చేసిందేమీ లేక మతాన్ని అడ్డుపెట్టుకొని ప్రచారం చేపడుతుందని ప్రజలే దానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కావున రాబోయే ఎన్నికల్లో భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే, రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలంటే బిజెపి దాని మిత్రపక్షాలను ఓడించగలిగినప్పుడే అంబేద్కర్ కలలు గన్నా రాజ్యాం గాన్ని స్థాపించగలమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాలం సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి, బి. సూరిబాబు, తులసి, పి.రాజశేఖర్, ఎస్. ఉమా, కృష్ణ, రాము, లక్ష్మి, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి టి.జీవ, నాయకులు సూరయ్య, ఎఐఎఫ్‌టియు నాయకులు పి.సంగం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభ్యులు

విజయనగరం టౌన్ : బిజెపి నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కి ఘన నివాళి అని రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు రెడ్డి శంకర్రావు అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, మత సామరస్యాన్ని, కాపాడుకుంటాం.. మతోన్మాదాన్ని వ్యతిరేకిద్దాం.. అంటూ ప్లకార్డులతో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న బిజెపి రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని, వాక్, సభా స్వాతంత్ర్యాలను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బిజెపి నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు లౌకిక శక్తులన్నీ ఐక్యంకావాలని కోరారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ, సిహెచ్ వెంకటేష్, డి.రాము, హరీష్, అస్లాం, శాంత మూర్తి, రామారావు, భాస్కరరావు, ప్రసన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నగరంలో అంబేద్కర్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి జన విజ్ఞాన వేదిక నాయకులు వి.రాజ్‌గోపాల్, ఎంవిఎన్ వెంకటరావు, శశిధర్, జి.నిర్మల, చిన్నారి, సురేష్ కుమార్, శశికళ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటామని, అంబేద్కర్ ఆశయాలను సాధిస్తామని నినాదాలు చేశారు.

కనకదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జొన్నగుడ్డిలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎఐఆర్‌టిఎఫ్ జాతీయ కౌన్సిల్ మెంబర్ ఎ.జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ కోట్లాదిమంది స్వయం ఉపాధితో బతుకుతున్న రవాణా రంగాన్ని బిజెపి ప్రభుత్వం విడిచి పెట్టడం లేదని చెప్పారు.మరోసారి బిజెపి అధికారంలోకి వస్తే డ్రైవర్లంతా జైల్లో ఉండాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రామారావు, నాయకులు భాస్కరరావు, ప్రసన్న, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌పై హత్యాయత్నానికి కుట్ర : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

సిఎం జగన్ మోహన్‌రెడ్డిపై దాడి వెనుక ఆయన హత్యాయత్నానికి జరిగిన కుట్రగా భావిస్తున్నామని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. ఆదివారరం తన నివాసంలో నల్ల బ్యాడ్జీలతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డిపై రాయి దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. టిడిపికి అనుకూలంగా ఉండే విజయవాడలో మేమంతా సిద్ధం బస్సు యాత్రకు లభించిన ప్రజాదరణ చూసి ఓర్వలేకనే టిడిపి, జనసేన పార్టీలు కుట్ర చేశాయనే అనుమానాలు వున్నాయని అన్నారు. ఈ దాడి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని లేదా సిబిఐ విచారణ చేపట్టాలని కోరారు. సిఎం జగన్‌కు భద్రత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గెలుపు బాటలో వున్న వైసిపి అభ్యర్థులందరికీ భద్రత పెంచాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, సీనియర్ నాయకులు గొర్లి మధుసూదనరావు, దండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ ఖండన

విజయనగరం టౌన్ : సిఎం జగన్‌పై దాడికి పాల్పడటం అప్రజాస్వామికమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం స్థానిక గంజిపేటలో జరిగిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో అంబేద్కర్ కాంస్య విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఇలాంటి దాడులు చేసి ఎన్నికలలో లబ్ధి పొందాలని టిడిపి, ఇతర పార్టీలు చూస్తున్నా యని ఆరోపించారు. జగన్ అంటే భయంతోనే ఇలాంటి దాడులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటువంటి దాడులను ఎవరైనా, ఏ పార్టీ వారైనా ఖండించాల్సి ఉందని, కానీ రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు ఆ పని చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పీరుబండి జైహింద్ కుమార్, కార్పొరేటర్ పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీ ధరించి విలేకరులతో మాట్లాడుతున్న రాజన్నదొర

ప్రజాదరణ చూడలేకే సిఎంపై దాడి : ఎంపి

సిఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక దుండగులు ఆయనపై రాయితో దాడి చేశారని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. రాయి దాడిని హేయమైన, పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఆదివారం మూడో డివిజన్లో డబుల్ కాలనీలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, కార్పొరేటర్ ఆనంద్ బాబు, వైసిపి నాయకులు మెండా రమణ, వేముల రాంప్రసాద్, సిద్ధాబత్తుల జగదీష్, వేముల ప్రకాష్, నైదాన సతీష్ పాల్గొన్నారు.

జగన్‌పై దాడికి ఖండన

జియ్యమ్మవలస : సిఎం జగన్మోహన్ రెడ్డిపై విజయవాడలో జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు తెలిపారు. జగన్మోహన్ రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే ప్రతిపక్ష పార్టీల నేతలు ఇలాంటి దుష్ట చర్యలకు పాల్పడ్డారని, దీన్ని యావత్ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఛీకొడుతున్నారన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

భామిని : రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డిపై రాయితో దాడి చేయడం హేయమైన చర్య అని వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం అన్నారు. మండలంలోని కాట్రగాఢ -బిలోని అలికాం బత్తిలి రోడ్డుపై నల్ల బ్యాడ్జీలతో వైసిపి నాయకులు నిరసన తెలిపారు. ప్రజల్లో జగన్‌కు వున్న ఆదరణను తట్టుకోలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, దాడి చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం వైస్ ఎం పి పి బోనగడ్డి ధర్మారావు, టింగ అన్నాజీ రావు, గేదెల మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి :సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైసిపికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు సిఎం జగన్మోహన్ రెడ్డిపై దాడి చేశాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మే 13న మరోసారి వైసిపిని గెలిపించి జగన్మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల ప్రచారానికి మంచి స్పందన రావడంతో టిడిపి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని విమర్శించారు. బొబ్బిలి నియోజకవర్గంలో వైసిపికి మంచి ఆదరణ వస్తే ఆదరణ లేదని టిడిపి గ్లోబల్ ప్రచారం చేస్తుందన్నారు. వైసిపిలో గెలిచి టిడిపిలో చేరి మంత్రి పదవి పొందిన రాజు అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బొబ్బిలిలో వైసిపి గెలవడం ఖాయమని జోష్యం పలికారు.

గజపతినగరం: సిఎం జగన్‌పై దాడి అప్రజాస్వామికమని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రకు జగన్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇటువంటి పనికిమాలిన చర్యలకు ప్రతిపక్ష నాయకులు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనికి పాల్పడిన వారు ఎవరైనప్పటికీ విడిచిపెట్టే ప్రసక్తి లేదని అన్నారు.